సాక్షి మహబూబాబాద్

ఆదివారం । 7 । మే । 2023



నిమిషం ఆలస్యమైనా 'నో ఎంట్రీ'

నీట్ పరీక్షకు అభ్యర్థులు ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించమని నీట్ ఎంట్రన్స్ ఎగ్జామ్ సిటీ ఇన్‌చార్జ్ శ్రీరాముల ఉమారాణి అన్నారు. - 8లో▸



చిన్నారుల ఆచూకీ లభ్యం

జిల్లా కేంద్రంలో అదృశ్యమైన ఇద్దరు చిన్నారుల ఆచూకీ లభ్యమైంది. 6గంటల్లోనే పోలీసులు స్పందించి పిల్లలను తీసుకొచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
$38^0/26^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం ఆహ్లాదకరమైన వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు పెరిగి ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

రాష్ట్ర చీఫ్ సెక్రటరి శాంతికుమారి



మహబూబాబాద్: జిల్లాల్లో ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని రాష్ట్ర చీఫ్ సెక్రటరి శాంతి కుమారి కలెక్టర్లను ఆదేశించారు. హైదరాబాద్ నుంచి రాష్ట్ర చీఫ్ సెక్రటరీ శాంతి కుమారి ఉన్నతాధికారులతో కలిసి ఆరోగ్య మహిళ, ధాన్యం కొనుగోలు తదితర అంశాలపై కలెక్టర్లతో వీసీ నిర్వహించి సమీక్షించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు వేగవంతంగా జరిగేలా నిరంతరం పర్యవేక్షిస్తున్నామన్నారు. కంటి వెలుగు, ఆరోగ్య మహిళ కార్యక్రమాలను విజయవంతం నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు విస్తరణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. జీఓ 58, 59 గడువు పెంపుపై ప్రజలకు తెలియ చేశామన్నారు. వీసీలో అదనపు కలెక్టర్ ఎం డేవిడ్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో అత్యాధునిక సౌకర్యాలు



నెల్లికుదురు: ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ సంస్థలను తలదన్నేలా అత్యాధునికమైన సౌకర్యాలను కల్పించేందుకే ప్రభుత్వం మన ఊరు-మన బడి కార్యక్రమం ప్రవేశపెట్టి నిర్వహిస్తుందని డీఈఓ రామారావు అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ ఎర్రబెల్లి మాధవి అధ్యక్షతన శనివారం ఏర్పాటు చేసిన మన ఊరు-మన బడి పనుల పురోగతి యాప్‌లో ఫొటో అప్‌లోడ్ తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ మండలంలోని వివిధ గ్రామాల్లోని 22 ప్రభుత్వ పాఠశాలలను మన ఊరు-మన బడి కార్యక్రమం మొదటి విడతలో ఎంపిక అయినట్లు తెలిపారు. మండలంలోని ధర్మతండా, నెల్లికుదురు ప్రాథమిక పాఠశాలలు 100 శాతం పూర్తి అయినట్లు తెలిపారు. 20 పాఠశాలల్లో ఎలాంటి అజాగ్రత్త వహించకుండా పనుల వేగం పెంచాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శాస్త్రి, ఎంఈఓ గుగులోతు రాము, అసిస్టెంట్ ఇంజనీర్ అలీ, సర్పంచ్ బీరవెల్లి యాదగిరిరెడ్డి, ప్రజాప్రతినిధులు, విద్యా కమిటీ చైర్మన్లు, మండల ఎంఐఎస్ కో ఆర్డినేటర్ మస్కపురి సుధాకర్, సీఆర్పీలు పాల్గొన్నారు.

జూనియర్ సివిల్ కోర్టు జడ్జిగా సరిత

తొర్రూరు: స్థానిక జూనియర్ సివిల్ కోర్టు జడ్జిగా ఎం.సరిత నియమితులయ్యారు. శనివారం డివిజన్ కేంద్రంలోని కోర్టులో బాధ్యతలు స్వీకరించారు. నూతన జడ్జికి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.లాలునాయక్, ప్రధాన కార్యదర్శి డి. నాగేశ్వర్, న్యాయవాదులు వెంకన్న, ఐలోని, శ్రీనివాస్, రామకృష్ణ, అశోక్, శ్రీశైలం, భాస్కర్, గౌస్, విజయ, పల్లవిలు పాల్గొన్నారు.

ప్రభబండ్ల ప్రదర్శనలో ఉద్రిక్తత

గూడూరు: మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీ నారాయణస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం నిర్వహించిన ప్రభ బండ్ల ప్రదర్శన ఉద్రిక్తతల నడుమ కొనసాగింది. సాయంత్రం 5 గంటలకు దేవాలయం చేరుకున్న బీఆర్‌ఎస్ ప్రభబండి వాహనం, అశ్వ వాహనంపై లక్ష్మీనారాయణస్వామి బయలుదేరే వరకు ఆలయ ప్రాంగణంలో నిలిపారు. ఆరగంట తర్వాత ఆలయ కమిటీ అధ్యక్షుడు నూనావత్ రమేష్‌నాయక్ సహకారంతో కాంగ్రెస్ పార్టీ నాయకుల ప్రభ బండి ఆలయం చుట్టూ ప్రదర్శన చేసింది. అనంతరం లక్ష్మీ నారాయణస్వామి అశ్వవాహనం ఊరేగింపునకు బయలుదేరగా మా వాహనమే దేవుడి శావ వెనుక వెళ్లాలని ఇరు వర్గాలు పట్టుపట్టారు. దీంతో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకుల మధ్య ఉద్రిక్తత నెలకొంది. చివరకు ఆలయ కమిటీ చైర్మన్ రమేష్ వారించి కాంగ్రెస్ పార్టీ ప్రభబండి వాహనాన్ని దేవుడి శావ వెనుకాల కదిపారు. అనంతరం మండల నాయకుల సమాచారంతో ఎమ్మెల్యే శంకర్‌నాయక్ అక్కడికి చేరడంతో స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు మరింత రెచ్చిపోయారు. దేవుడి శావ వెనుకాల బీఆర్‌ఎస్ ప్రభ బండి ఉండాలని పట్టుబట్టడంతో పోలీసులు కాంగ్రెస్ వాహనాన్ని నిలిపేసి బీఆర్‌ఎస్ ప్రభ బండిని దేవుడి వెనుకాలకు చేర్చారు. దీంతో తామే నెగ్గామని జై శంకరన్నా.. అంటూ బీఆర్‌ఎస్ నాయకులు నినాదాలు చేశారు. మొత్తానికి ఏ సంవత్సరం లేని విధంగా ఈసారి బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీ ప్రభబండ్ల రాకతో ప్రభబండ్ల ప్రదర్శన ఉద్రిక్తతలకు దారితీసిందని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు.

పండుగలే.. పండుగలు

- ఊరూరా సందడి
- బొడ్రాయి ప్రతిష్ఠాపనకు గ్రామాల్లో పోటీ
- కులదేవతల పండుగలతో కోలాహలం
- చుక్క..ముక్కతో.. మజా..



మహబూబాబాద్‌లో బొడ్రాయి వద్ద గ్రామస్తుల సందడి (ఫైల్)

Sunday Special

తెలంగాణ అంటేనే గ్రామదేవతలు, కుల దేవతల పండుగలకు నిలయం. గ్రామం బాగుండాలని అరిష్టం రావొద్దని ఊరి ప్రజలందరూ కలిసి చేసే బొడ్రాయి పండుగ. కులాల వారీగా కంఠమహేశ్వరుడు, సవ్వార్ లచ్చమ్మ, పెద్దమ్మ, దుర్గమ్మ, మారమ్మ, మహంకాళీ పండుగ ఇలా ఏ కులానికి ఆ కులం వారి కుల దేవతలను ఆరాధించడం, గుడి కట్టించడం, పండుగ చేయడం ఈ మధ్య కాలంలో నయా ట్రెండ్‌గా మారింది. పండుగల సందర్భంగా బంధువులు, మిత్రులను పిలుచుకోవడం, వారికి చీరెసారెలు పెట్టి సంతోష పెట్టడం, ఆడ పడుచులు జలబిందెలు పోయడం తమ పుట్టింటి వారిని చల్లంగా చూడాలని దీవించడం.. ఇలా ప్రతీ తంతూ సమష్టి కుటుంబం, సౌభాగ్యం, సంతోషాలతో ముడి పడి ఉంటుంది. అయితే పండుగ చివరి రోజు మాత్రం తెలంగాణ సాంప్రదాయం ఉట్టిపడేలా.. చుక్కా.. ముక్కతో పసందైన భోజనం పెట్టి సంతోష పెడతారు. -సాక్షి, మహబూబాబాద్



కంబాలపల్లిలో బోనాలతో మహిళలు (ఫైల్)

ఊరూరా బొడ్రాయి పండుగ

ఊరు పుట్టుకను చెప్పే చిహ్నం బొడ్రాయి. ఇది దశాబ్దాల క్రితం వేయడంతో మారిన ఊరి స్వరూపంతో అంతా చిన్నాభిన్నంగా మారుతోంది. దీనిని సరిచేసే పండుగే బొడ్రాయి పండుగ. గ్రామం మధ్యలో వేద మంత్రాలతో బొడ్రాయి ప్రతిష్ఠిస్తారు. ప్రతీ ఇంటి నుంచి ఆడపడుచులు జల బిందెలు తెచ్చి బొడ్రాయికి అభిషేకం చేస్తారు. నవధాన్యాలు, పసుపు కుంకుమతో పూజలు చేసి ఇంటిల్లిపాది సల్లంగా ఉండాలని కోరుకుంటారు. గ్రామ జంతువును బలిచ్చి పొలిమేరల్లో పొలి చల్లడం ఆనవాయితీ. అయితే ఈ పండుగ గ్రామంలోని ఏ ఒక్క కులానికో.. మతానికో సంబంధించినది కాకుండా.. అన్ని కులాలు, మతాలవారు ఇందులో పాలుపంచుకోవడం గమనార్హం. ముందుగా కమిటీలు వేసి, దాతల సహకారంతో ఈ పండుగలు నిర్వహిస్తారు. ఇలా ఇటీవల మహబూబాబాద్ జిల్లాకేంద్రంతోపాటు పోటీ పడి పండుగలు చేసుకుంటున్నారు.

కంఠమహేశ్వరుడి పండుగ



కంఠమహేశ్వరుడి పూజలో గీత కార్మికులు (ఫైల్)

గౌడ కులస్తులు చేసే పండుగ కంఠమహేశ్వరుడి పండుగ. ప్రమాదకరమైన వృత్తిలో భాగంగా తాటి చెట్టు ఎక్కి దిగే గౌడన్న, వారి కుటుంబాలు చల్లంగా ఉండాలని కోరుకుంటూ చేసుకునే పండుగ. ప్రధానంగా కుల దైవం కంఠమహేశ్వరుడు, ఎల్లమ్మ, వన మైసమ్మలను కొలిచే పండుగ. గౌడ కులానికి అనుబంధంగా ఉండే ఏనూటీ, జట్టి ఇతర కులస్తులు ఎల్లగౌడ్, సురాభ, పరుశరాముడు, ఎల్లమ్మ మొదలైన వారి ఇతి వృత్తాలతో కథలు చెబుతారు.



తండాల్లో దుర్గమ్మల పండుగ

గిరిజన లంబాడీ తండాల్లో దుర్గమ్మ, మహంకాళీ అమ్మవార్ల పండుగ జరుపుకోవడం పరిపాటిగా మారింది. తండా మొత్తం ఈ పండుగలో పాల్గొంటారు. గుడిని సుందరంగా అలంకరిస్తారు. నైవేద్యం సమర్పిస్తారు. ప్రతీ ఇంట్లో గొర్రెపోతులు కోసి ముందుగా పితృదేవతలకు మొక్కుతారు. ఆడ పడుచులు, బంధువులు, మిత్రులను ఆహ్వానించి సంబురాలు చేసుకుంటారు.

సవ్వార్ లచ్చమ్మ

ప్రతీ దళిత వాడలో ఉండే సవ్వార్ లచ్చమ్మ తల్లికి పూజలు చేసి పండుగ నిర్వహిస్తాం. గుడిని ప్రత్యేకంగా అలంకరిస్తారు. బైండ్ల కులస్తులు కథలు చెబుతూ అమ్మవారిని కొలిచే తంతులో అందరు పాల్గొంటారు. బోనాలు చెల్లించి చిందు యక్షగాణ బాగోతాలు వేస్తారు. జంతు బలిచ్చి పొలిచల్లుతారు.

పెద్దమ్మ తల్లి పండుగ

ముదిరాజ్‌లు చేసే పండుగ పెద్దమ్మ తల్లి. చెరువులో చాలు పోయడం, చేపల పెంపకం, చెట్టు పుట్టల వద్ద ఉన్న పండ్లు, కాయలను తెచ్చి అమ్మేవారు. వివిధ పనుల కోసం వెళ్లే వారిని చల్లంగా చూడాలని నిర్వహించే పండుగ ఇది. కొత్త గుడులు కట్టడం, విగ్రహాల ప్రతిష్ఠ, మొదలైనవి నిర్వహిస్తారు.

మేమే కీలకం..



గ్రామ దేవతలను కొలవడంలో బైండ్ల పూజారులే కీలకం. గ్రామాల్లో మసూచి, ఇతర వ్యాధులు వచ్చి ప్రజలు ఇబ్బందులు పడుతున్న సందర్భంలో గ్రామ దేవతలను కొలవడం ఆనవాయితీగా వచ్చింది. కథలు చెప్పడం, మేకలను మత్తగొలపడం, వివిధ తంతు నిర్వహిస్తాం. ఇందుకు తగినంత సంభావన ఇస్తారు. - గంగలు శ్రీనివాస్, బైండ్ల పూజారి

సల్లంగ సూడు లచ్చమ్మ తల్లీ..



మా కుల దేవత సవ్వార్ లచ్చమ్మ. మా ఇళ్లల్లో ఏ కార్యం చేసినా ముందు అమ్మవారిని కొలుస్తాం. గూడెం చల్లంగా ఉండాలని ప్రత్యేక పండుగ చేస్తాం. ముందు రోజు పూజలు చేసి అనంతరం జంతు బలిస్తాం. ఈ పండుగ రోజు మా గూడెం అంతా కోలాహలంగా ఉంటుంది. - పుచ్చకాయల రాంచందర్, దళిత పెద్ద

ఏర్పాట్లు చేస్తున్నాం..



మా కుల దైవం పెద్దమ్మతల్లిని కొలిచే పండుగ. ఇందుకోసం నర్సింహులపేటలో రూ. 35 లక్షలు పెట్టి గుడి కట్టించాం. ఈ నెల 15 నుంచి 18వ తేదీ వరకు పండుగ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. అమ్మవార్ల దీవెన కోసం చేసే తంతు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తాం. - మంద వెంకన్న, ముదిరాజ్ పెద్ద మనిషి

బాధ్యత లేకుంటే ఎలా?

- బయ్యారం కొనుగోలు కేంద్రంలో డీసీఓపై కలెక్టర్ ఆగ్రహం



రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్ శశాంక

బయ్యారం: బాధ్యత లేకుండా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులను ఇబ్బందులు పెడితే ఎలా? అని కలెక్టర్ శశాంక డీసీఓ ఖుర్షీద్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం బయ్యారంలో సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న, ధాన్యం కొనుగోలు కేంద్రంను కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సమయంలో ధాన్యం కొనుగోలుకు సంబంధించిన సెంటర్ ఇన్‌చార్జ్, ట్యాబ్ ఆపరేటర్లు ఎవరని కలెక్టర్ ప్రశ్నించారు. దీంతో ఎవరిని నియమించలేదని సమాధానం రావటంతో ఇన్‌చార్జ్‌లు, ఆపరేటర్ లేకుండా కేంద్రంను ఎలా ప్రారంభించారని ప్రశ్నించారు. బాధ్యత లేకుండా కొనుగోలు కేంద్రాల్లో రైతులను ఇబ్బందులు పెట్టే ప్రయత్నం చేస్తే సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుంటామన్నారు. వెంటనే ధాన్యం సెంటర్‌కు ఇన్‌చార్జ్, ట్యాబ్ ఆపరేటర్‌ను నియమించాలని ఆదేశించారు. అనంతరం సివిల్ సప్లయ్, మార్క్‌ఫెడ్, వ్యవసాయశాఖ అధికారులతో కలెక్టర్ మాట్లాడారు. తడిచి రంగు మారిన మొక్కజొన్నను కొనుగోలు చేయాలని పలువురు రైతులు కలెక్టర్‌ను కోరగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామన్నారు. అదనపు కలెక్టర్ డేవిడ్, జిల్లా పౌరసరఫరాల అధికారి నర్సింగరావు, సివిల్ సప్లయ్, మార్క్‌ఫెడ్ డీఎంలు కృష్ణవేణి, శ్యామ్, మండల ప్రత్యేకాధికారి లక్ష్మినారాయణ, తహసీల్దార్ రమేష్, సొసైటీ చైర్మన్ మధుకర్‌రెడ్డి, ఏఓ రాంజీ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలి

మహబూబాబాద్: వేసవి కాలంలో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నందున ఎండ తీవ్రతను తట్టుకునేందుకు తగు జాగ్రత్తలు తీసుకోని కలెక్టర్ శశాంక శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధి పనులు చేసే వారు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు వెంట తెచ్చుకోవాలని, తప్పనిసరి అయితేనే బయటకు రావాలని సూచించారు.

ఆయిల్‌పామ్ సాగు చేసేలా ప్రోత్సహించాలి

ఆయిల్‌పామ్ సాగుకు ప్రణాళిక అవసమని, ఆ సాగుకు రైతులను ప్రోత్సహించాలని కలెక్టర్ శశాంక అధికారులను ఆదేశించారు. శనివారం ఐడీఓసీలోని సమావేశ మందిరంలో ఆయిల్‌పామ్ సాగు విస్తరణ, తదితర విషయాలపై కలెక్టర్ సమీక్షించారు. ఆయిల్ పామ్ సాగులో నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించేందుకు ప్రణాళిక అవసరమన్నారు. డీఏఓ చత్రునాయక్, జిల్లా ఉద్యానవన శాఖాధికారి సూర్యనారాయణ, ఏడీఏ లక్ష్మినారాయణ, అధికారులు పాల్గొన్నారు. కాగా స్థలాల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకునే గడువును ఈనెల 31వ తేదీ వరకు అవకాశం కల్పించిందని కలెక్టర్ తెలిపారు.

విద్యార్థులు నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

- ట్రెయినీ కలెక్టర్ పింకేష్ కుమార్



సర్టిఫికెట్లు అందజేస్తున్న పింకేష్ కుమార్

తొర్రూరు: విద్యార్థులు నైపుణ్యాలు పెంపొందించుకోవాలని ట్రెయినీ కలెక్టర్ పింకేష్‌కుమార్ అన్నారు. డివిజన్ కేంద్రంలోని సంక్షేమ బాలికల గురుకులంలో గత కొద్ది రోజులుగా కొనసాగుతున్న స్పార్కిల్స్ వేసవి శిక్షణా శిబిరం శనివారంతో ముగిసింది. బేసిక్ ఇంగ్లిష్, లైఫ్ స్కిల్స్, సైన్స్ ప్రాజెక్టులు, డ్రోన్ టెక్నాలజీపై ఆయా గురుకులాలకు చెందిన 200 మంది విద్యార్థులు శిక్షణ పొందారు. విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు జెడ్పీ ఫ్లోర్ లీడర్ మంగళపల్లి శ్రీనివాస్‌తో కలిసి సర్టిఫికెట్లు అందించారు. పాఠశాల ప్రిన్సిపాల్ జి.జయశ్రీ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పింకేష్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు వివిధ అంశాలపై పట్టు సాధించాలన్నారు. కమ్యూనికేషన్ స్కిల్స్, ఉద్యోగ సాధనకు అవసరమైన నైపుణ్యాలు పెంపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై సతీష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'నీట్'కు ఏర్పాట్లు పూర్తి

మహబూబాబాద్ అర్బన్: మెడికల్ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే నీట్ ప్రవేశ పరీక్ష నేడు (ఆదివారం) జిల్లా కేంద్రంలోని ఏకశిల ఏంజెల్స్ పాఠశాలలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5:20 వరకు నిర్వహిస్తున్నట్లు జిల్లా కోఆర్డినేటర్ రమేష్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మానుకోట జిల్లాలో ఒకే పరీక్ష కేంద్రం మాత్రమే ఉందని, ఈ సెంటర్‌లో మొత్తం 570 మంది విద్యార్థులు హాజరవుతున్నారని, ప్రవేశ పరీక్షకు ఉదయం 11:30 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు విద్యార్థులను కేంద్రాల్లోకి అనుమతిస్తామన్నారు. విద్యార్థులు మూడు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, ఆధార్ కార్డు, పాన్ కార్డు, ఓటరు కార్డుల్లో ఏదైన ఒరిజినల్ తప్పనిసరిగా వెంట తీసుకురావాలన్నారు. పరీక్షకు అడ్మిట్ కార్డులో సెంటర్ నంబర్‌ను సరి చూసుకోవాలని, పరీక్ష కేంద్రానికి సంబంధించిన ఏమైన సందేహాలు ఉంటే 9492781235 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

అభివృద్ధి సూచి పెరగాలి


ఓరుగల్లులో తాగునీరు, పారిశుద్ధ్య సమస్యలు తగ్గలేదు


- పెరగని బ్యాంకు ఖాతాలు... 12.45 శాతం పేదరికమే
- పారిశుద్ధ్య లోపం పల్లెల్లో 63 శాతం.. పట్టణాల్లో 28.71 శాతం
- ఉమ్మడి వరంగల్‌లో ఇంకా 33.89 శాతం నీటిసమస్య
- నీతి అయోగ్ 'మల్టీ డైమెన్షనల్ పావర్టీ' నివేదికలో వెల్లడి



సాక్షిప్రతినిధి, వరంగల్:

తెలంగాణ వ్యాప్తంగా చూస్తే.. ఉమ్మడి వరంగల్ పరిస్థితి పరవాలేదు. అయితే ఉమ్మడి జిల్లా బతుకు చిత్రంలో మార్పు రావాల్సిన అవసరం ఉంది. పేదరికం సమస్య ఇంకా సమసిపోకపోగా, పల్లెలు, పట్టణాల్లో చాలామందికి పక్కా ఇళ్ల రూపంలో సొంతిళ్లు ఇంకా కలగానే మిగిలాయి. హనుమకొండ, వరంగల్, జనగామ జిల్లాల్లో అంతగా లేని పౌష్టికాహారం లభ్యతా లోపం మహబూబాబాద్, ములుగు, జేఎస్ భూపాలపల్లి జిల్లాల్లో కనిపిస్తోంది. ఏజెన్సీ ప్రాంతాల్లో పౌష్టికాహారం విషయంలో ఇంకా పాత సమస్యలే ఎదురవుతున్నాయి. పట్టణాలు, పల్లెలు అనే తేడా లేకుండా ఇంటింటి కీ పారిశుద్ధ్యం, తాగు నీరు సమస్యలు పూర్తిగా తీరలేదు. గ్రామీణ ప్రాంతాల సర్కారు స్కూళ్లలో విద్యార్థుల నమోదు పెరగలేదు. ఇక.. జనాభాలో 6.47శాతం మందికే బ్యాంకు ఖాతాలు ఉన్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలో నెలకొన్న ఈ పరిస్థితులను నీతి అయోగ్ ఇటీవల విడుదల చేసిన 'మల్టీ డైమెన్షనల్ పావర్టీ నివేదిక'లో వెల్లడించింది.





తగ్గుతున్న పేదరికం.. రాష్ట్రంలో నాలుగో స్థానం

తెలంగాణ సగటు కన్నా చాలా విషయాల్లో ఉమ్మడి వరంగల్ మెరుగ్గానే ఉన్నప్పటికీ.. రెండో నగరం, ప్రాంతంగా ఉన్న ఉమ్మడి జిల్లా మరింత వేగంగా అభివృద్ధి సాధించాల్సి ఉంది. ఐటీ, ఎడ్యుకేషన్, హెల్త్ హబ్‌గా రూపుదిద్దుకుంటున్న తరుణంలో ప్రజల జీవన ప్రమాణాల పెంపునకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు మరిన్ని అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేయాల్సి ఉంది. ఐదేళ్ల కిందటి పరిస్థితికి.. ప్రస్తుత స్థితికి పోలిస్తే పేదరికం తగ్గుముఖం పడుతున్నట్లు నివేదిక చెబుతోంది. రాష్ట్రంలో పేదరికం తక్కువగా ఉన్న జిల్లాల జాబితాలో ఉమ్మడి జిల్లా నాలుగో స్థానంలో ఉంది. 4.27 శాతంతో హైదరాబాద్ మొదటి స్థానం, 5.83 శాతంతో రంగారెడ్డి రెండో స్థానం కాగా, 9.20తో కరీంనగర్ మూడు, 12.45 శాతంతో వరంగల్ నాలుగోస్థానంలో ఉన్నాయి. ఇదే సమయంలో పట్టణీకరణ, ఐటీ, పరిశ్రమల ఏర్పాటు ఉపాధి అవకాశాల వల్ల వరంగల్, హనుమకొండ, జనగామ, జేఎస్ భూపాలపల్లి జిల్లాల అభివృద్ధిలో పురోగతి ఉంది.

తాగునీరు, పారిశుద్ధ్యం మెరుగవ్వాలి...

ఉమ్మడి వరంగల్‌లో 38,20,369 మంది జనాభా ఉంది. ఇందులో 28,28,036 మంది పల్లెల్లో, 9,92,333 మంది పట్టణాల్లో జీవనం గడుపుతున్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని రూ.కోట్లు ఖర్చు చేసి మిషన్ భగీరథ ద్వారా నీరు అందిస్తున్నా.. ఇంకా 12,94,723 (33.89 శాతం) మందికి పక్కా కనెక్షన్ల ద్వారా నీరు అందడం లేదని నివేదిక తేల్చింది. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్, తొమ్మిది మున్సిపాలిటీలు ఉండగా, ఉమ్మడి జిల్లాలో 20,29,380 మంది (53.12 శాతం) పారిశుద్ధ్య సమస్యను ఎదుర్కొంటున్నారని పేర్కొంది. గ్రామీణ ప్రాంతాల్లో 63శాతం.. పట్టణాల్లో 28.71 శాతంగా ఉన్నారు. రాష్ట్రంలో 31.10 శాతం మందికి పౌష్టికాహారం లోపం ఉండగా, ఉమ్మడి జిల్లాలో 11,46,492 (30.01 శాతం) మందికి ఈ సమస్య ఉత్పన్నం అవుతోంది.



జిల్లాల వారీగా మొత్తం జనాభా, గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఇలా..

జిల్లా	మొత్తం జనాభా	గ్రామీణం	పట్టణ/నగరం
హనుమకొండ	10,62,247	4,98,618	5,63,629
వరంగల్	7,37,148	5,10,057	2,27,091
జనగామ	5,34,991	4,63,634	71,357
జేఎస్.భూపాలపల్లి	4,16,763	3,74,376	42,387
మహబూబాబాద్	7,74,549	6,98,173	76,376
ములుగు	2,94,671	2,83,178	11,493

సర్వేకు ఎన్‌ఎఫ్‌హెచ్‌ఎస్ మూలాలే ఆధారం... .

జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే (ఎన్‌ఎఫ్‌హెచ్‌ఎస్) గతంలో నిర్వహించిన మూలాల ఆధారంగా ఈ నివేదికను పొందుపర్చారు. ఇందులో ముఖ్యంగా ఆరోగ్యం, విద్య, జీవన విధానం అనే మూడు విషయాలను పరిగణలోకి తీసుకున్నారు. పేదరిక నిర్మూలనకు ప్రధానమైన వాటిలో ఈ మూడింటిలో మంచి మార్పు కీలకం. ఆరోగ్యం పరంగా పౌష్టికాహార లోపం, శిశు కౌమార మరణాలు, తల్లి ఆరోగ్యంపై దృష్టి పెట్టారు.

ప్రాణం తీసిన ధాన్యం కుప్ప


రాజయ్య(ఫైల్)

హసన్‌పర్తి: రోడ్డుపై ఆరబోసిన ధాన్యంపై నుంచి వెళ్తున్న బైక్ అదుపు తప్పడంతో ఓ రైతు మృతి చెందాడు. ఈ సంఘటన హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం మడిపల్లి శివారులో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... అన్నాసాగరానికి చెందిన వెలిశోజు రాజయ్య(55) కొంతకాలంగా నగరంలోని గోపాలపురంలో కుటుంబసభ్యులతో ఉంటున్నారు. రోజూ అన్నా సాగరంలోని వ్యవసాయ పనులకు వెళ్లి రాత్రి గోపాలపురానికి వెళ్తుంటాడు. రోజు మాదిరిగానే శుక్రవారం పనులు ముగించుకుని బైక్‌పై గోపాలపురానికి బయల్దేరాడు. మడిపల్లి శివారులోని ప్రధాన రహదారిపై వరికుప్పలు ఆరబోసి ఉన్నాయి. ధాన్యంలోనుంచి వెళ్తుండగా బైక్ అదుపు తప్పింది. ఈ ప్రమాదంలో రాజయ్య తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి కుటుంబాన్ని వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ పరామర్శించారు. రోడ్లపై ధాన్యం ఆరబోయద్దని రెవెన్యూ, పోలీస్‌అధికారులు హెచ్చరిస్తున్నారు. అయినా కొందరు రైతులు తేమశాతం తగ్గించుకునేందుకు ఎండబెడుతున్నారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం


మృతదేహాన్ని ఒడ్డుకు చేరుస్తున్న ఈతగాళ్లు

వెంకటాపురం(కె): మండల పరిధిలోని వీరభద్రవరం గ్రామంలో శుక్రవారం పెళ్లి వేడుకలకు హాజరై అంకన్నగూడెం సమీపంలోని గోదావరి నదిలో స్నానానికి వెళ్లి గల్లంతైన రహీమ్ (22) మృతదేహం శనివారం లభ్యమైంది. శనివారం ఉదయం ఎస్సై తిరుపతిరావు ఆధ్వర్యంలో గోదావరిలో గల్లంతైన వ్యక్తి కోసం నదిలో పడవలు, ఈతగాళ్లతో వెతికించారు. శనివారం మృతదేహం లభ్యం కావటంతో మృతదేహాన్ని వెంకటాపురం వైద్యశాలకు తరలించి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.



నిమిషం ఆలస్యమైనా 'నో ఎంట్రీ'

- నేడు నీట్
- నగరంలో 10 పరీక్ష కేంద్రాలు
- హాజరు కానున్న 5,300 మంది అభ్యర్థులు

విద్యారణ్యపురి : జాతీయ స్థాయిలో వైద్య, విద్య ప్రవేశ అర్హత పరీక్ష(నీట్)లకు అభ్యర్థులు ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించమని నీట్ ఎంట్రన్స్ ఎగ్జామ్ సిటీ ఇన్‌చార్జ్ శ్రీరాముల ఉమారాణి అన్నారు. ఆదివారం నిర్వహించే ప్రవేశ పరీక్ష ఏర్పాట్లపై శనివారం హంటర్‌రోడ్‌లోని వరంగల్ పబ్లిక్‌స్కూల్‌లో అడిషనల్ డైరెక్టర్ గూడూరు జ్యోతి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమారాణి మాట్లాడుతూ ప్రవేశ పరీక్ష కోసం ఉమ్మడి జిల్లాలో ఏర్పాట్లు పూర్తయినట్లు తెలిపారు. నగరంలోని 10 పరీక్షా కేంద్రాల్లో 5,300 మంది అభ్యర్థులు హాజరవుతున్నారని తెలిపారు. సమావేశంలో పాల్గొన్న పరీక్ష కేంద్రాల సూపరింటెండెంట్లు, అబ్జర్వరు, అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. పరీక్ష నిర్వహణ నిబంధనలకు సంబంధించిన వివరాలను ఉమారాణి వెల్లడించారు. పరీక్షలు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5.20 వరకు జరుగుతాయన్నారు. ఉదయం 11.00 గంటల నుంచి అభ్యర్థులను పరీక్ష కేంద్రాల హాల్‌లోకి అనుమతిస్తామన్నారు. మధ్యాహ్నం 1.30 గంటల తరువాత ఒక నిమిషం ఆలస్యం అయినా అనుమతించమన్నారు. అభ్యర్థులు తమ పాస్‌పోర్ట్ సైజు ఫొటో అడ్మిట్ కార్డుకు అంటించుకొని మరొక ఫొటో తమ వెంట తీసుకొని రావాలన్నారు. అదేవిధంగా ఆధార్, డ్రైవింగ్ లైసెన్స్, ఓటరు గుర్తింపుకార్డు, పాస్‌పోర్టు, పాన్ కార్డు, వీటిలో ఏదైనా ఒక కార్డు ఉంటేనే పరీక్ష కేంద్రం హాల్‌లోకి అనుమతిస్తామని తెలిపారు. సెల్ ఫోన్లు, బ్లూటూత్, ఇయర్ ఫోన్స్, మైక్రోఫోన్, పేజర్, హెల్త్ బ్యాండ్‌తో పాటు పర్సులు, కళ్లద్దాలు, చేతి బ్యాగులు, బెల్టులు, క్యాపు, ఏటీఎం కార్డులు, ప్లాస్టిక్ కార్డులు, రిమోట్ కీ తదితర వస్తువులు తీసుకురావద్దన్నారు. అభ్యర్థులు డ్రెస్‌కోడ్ తప్పనిసరిగా పాటించాలి. పొడవు చేతులున్న డ్రెస్సులు, షూలు, రింగులు, బ్రాస్‌లైట్లు, చెవి దుద్దులు, ముక్కుపుల్ల, నెక్లెస్, చైన్లు తదితర అలంకరణ వస్తువులను కూడా అనుమతించమన్నారు. ప్రత్యేక అవసరాలు కలిగిన దివ్యాంగులు తన ధృవీకరణ పత్రం తీసుకొస్తే వారికి కేంద్రం లోపల ప్రత్యేక సౌకర్యాలు కల్పిస్తామన్నారు. దూర ప్రాంతాల్లో ఉన్న కేంద్రాలకు చేరవేయడానికి ఆర్టీసీ ప్రత్యేక బస్సుల సౌకర్యం కల్పించడం, వైద్యశాఖ వారు అత్యవసర చికిత్సలు అందిచడం, విద్యుత్ శాఖ వారు నిరంతర విద్యుత్ అందించడం తదితర సంబంధిత శాఖలు తమ సేవలు అందించేలా ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. తల్లిదండ్రులు నిర్దేశించిన సమయానికి ఒక గంట ముందే పిల్లలను కేంద్రాల వద్ద దింపితే ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు.

నగరంలో పరీక్ష కేంద్రాలు...

- కిషన్‌పురలోని చైతన్య డిగ్రీ కళాశాల
- హనుమకొండలోని ఎస్ఆర్ ప్రైమ్ స్కూల్
- కాజీపేటలోని సెయింట్ గాబ్రియల్
- వరంగల్ ఎన్ఐటీ ఇంజనీరింగ్ కళాశాల
- హనుమకొండలోని సెయింట్ పీటర్స్ స్కూల్
- నందిహిల్స్‌లోని న్యూ సైన్సు పీజీ కళాశాల
- హంటర్‌రోడ్‌లోని అల్లూరి ఇన్‌స్టిట్యూట్
- ఉర్సుగుట్టలోని తాళ్లపద్మావతి ఫార్మసీ కళాశాల
- హసన్‌పర్తిలోని గ్రీన్‌వుడ్ స్కూల్
- హంటర్‌రోడ్‌లోని వరంగల్ పబ్లిక్ స్కూల్

10న ఉమ్మడి జిల్లాస్థాయి బాక్సింగ్ ఎంపిక పోటీలు

వరంగల్ స్పోర్ట్స్: ఈ నెల 10న హనుమకొండ ప్రభుత్వ పాఠశాల ఆవరణలోని డీఎస్ఏ బాక్సింగ్ హాల్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి యూత్ మెన్, ఉమెన్ బాక్సింగ్ ఎంపిక పోటీలను నిర్వహిస్తున్నట్లు బాక్సింగ్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పెద్దమ్మ నర్సింహరాములు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇందులో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు ఈ నెల 13, 14వ తేదీల్లో హైదరాబాద్ షేక్‌పేట్‌లోని మున్సిపల్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఎంపికలో పాల్గొనే క్రీడాకారులు 10న ఉదయం 8 గంటలకు బాక్సింగ్ హాల్ వద్ద హాజరైతే వెయింగ్ తీసుకోబడుతుందని తెలిపారు. ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రం, స్కూల్ మెమో, రెండు పాస్‌ఫొటోలు తీసుకునిరావాలని సూచించారు. పూర్తి వివరాలకు 98492 29752 నంబర్‌ను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

చిన్నారుల ఆచూకీ లభ్యం

- ఫిర్యాదు చేసిన 6 గంటల్లో ఛేదించిన పోలీసులు


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రమణబాబు

మహబూబాబాద్ రూరల్ : జిల్లా కేంద్రంలో అదృశ్యమైన గుల్లకుంట కాలనీకి చెందిన ఇద్దరు చిన్నారుల ఆచూకీ లభ్యమైంది. మహబూబాబాద్ ఇన్‌చార్జ్ డీఎస్పీ రమణబాబు శనివారం టౌన్ పోలీసు స్టేషన్లో వెల్లడించారు. గుల్లకుంట కాలనీకి చెందిన తాటి గోపి–నాగమణి దంపతుల కుమారులు ప్రేం కుమార్, వినోద్ కుమార్ శుక్రవారం ఉదయం 8 గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లి రాత్రి వరకు తిరిగిరాలేదు. దీంతో ఆందోళనకు గురైన తల్లిదండ్రులు టౌన్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆదేశాల మేరకు జిల్లా యంత్రాంగం అప్రమత్తం అయి అడిషనల్ ఎస్పీ జోగుల చెన్నయ్య ఆధ్వర్యంలో స్పెషల్ టీమ్స్ ఏర్పాటు చేశారు. జిల్లా పరిధిలోని బ్లూ కోల్ట్స్, పెట్రోలింగ్ సిబ్బందితో పట్టణమంతా గాలింపు చర్యలు చేపట్టారు. వివిధ కోణాల్లో దర్యాప్తు జరుపుతూ, బస్ స్టేషన్, రైల్వే స్టేషన్లు తనిఖీ చేశారు. దర్యాప్తులో భాగంగా తల్లిదండ్రులను, బంధువులను విచారించగా వారు ఇచ్చిన సమాచారం మేరకు పిల్లలు ఖచ్చితంగా ఏదో ఒక రైలు ఎక్కి ఎక్కడికో వెళ్లి ఉంటారని భావించారు. రైల్వే పోలీసులను అందరినీ అప్రమత్తం చేసి సీసీ కెమెరాల ద్వారా పట్టణం జల్లెడ పట్టారు. పోలీసులు ఇచ్చిన సమాచారం మేరకు ఖమ్మం రైల్వే స్టేషన్లో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరు పిల్లలను విచారించగా తల్లదండ్రులు ఇచ్చిన సమాచారంతో పోల్చి చూసి పిల్లలు దొరికినట్లు నిర్ధారణ చేసుకున్నారు. అనంతరం ఖమ్మం నుంచి పిల్లలను తీసుకొచ్చి వారి తల్లిదండ్రులకు అప్పగించామని తెలిపారు. సదరు కేసును ఛేదించడంలో పాత్రులైన టౌన్ డీఎస్పీ రమణబాబు, సీఐ సతీష్, పోలీస్ సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యం

- టెక్స్‌టైల్ పార్కులో ఉపాధి కల్పించేందుకు కుట్టుశిక్షణ దోహదం
- పదివేల మందికి ఉపాధి కల్పించేందుకు చర్యలు
- మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు


కుట్టుశిక్షణలో తమ అనుభవాలను మంత్రి ముందు తెలుపుతున్న మహిళ

రాయపర్తి : మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్రపంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. శనివారం మండలంలోని పెర్కవేడు, రాయపర్తి, కాట్రపల్లి గ్రామాల్లో కుట్టుశిక్షణ పూర్తి చేసుకొని ముగింపు సమావేశంలో మంత్రితో పాటు జిల్లా కలెక్టర్ ప్రావీణ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పదివేల మందికి వరంగల్ టెక్స్‌టైల్ పార్కులో ఉద్యోగ, ఉపాధిని కల్పించేందుకు రాష్ట్రంలోనే మొదటగా పైలట్ ప్రాజెక్టుగా పాలకుర్తి నియోజకవర్గంలో కుట్టుశిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఉచిత కుట్టుశిక్షణతో పాటు ఉచితంగా కుట్టుమిషన్ల పంపిణీని విజయవంతంగా నిర్వహిస్తున్నామన్నారు. రూ.5కోట్ల నిధులతో మొదటగా 3 వేల మందికి శిక్షణ పూర్తి చేశామని, మిగతా 7వేల మందికి శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. ఇప్పటికిప్పుడు కుట్టుశిక్షణ పూర్తి చేసుకున్నవారికి దాదాపు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ శ్రీవాత్స, డీఆర్‌డీఓ సంపత్‌రావు, డీపీఎం భవానీ, ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్, తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీఓ కిషన్, ఏపీఎం అశోక్, సర్పంచ్, ఎంపీటీసీలు చిన్నాల తారశ్రీ, బండి అనూష, గారె నర్సయ్య, ఐత రాంచందర్, బిల్లా రాధిక, ట్రైనర్లు బీర్రు రమాదేవి, టి రమ, మహిముదా తదితరులు పాల్గొన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

బీజేపీ, కాంగ్రెస్ పాలిత ప్రాంతాల్లో ధాన్యంను తక్కువ ధరలకే కొనుగోలు చేస్తున్నారని తెలంగాణ రాష్ట్రంలో రైతన్నలకు గిట్టుబాటు ధరను కల్పించడమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పేర్కొన్నారు. మండలంలోని పెర్కవేడులో జాంబవ రైతు ఉత్పత్తిదారుల సంఘం, రాయపర్తిలో ఉషోదయ రైతు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో మక్కల కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ప్రావీణ్యతో కలిసి శనివారం ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ వరిధాన్యంతో పాటు మక్కల కొనుగోలును ప్రభుత్వమే చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీవాత్సవ, డీఆర్‌డీఓ సంపత్‌రావు, ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ రామచంద్రారెడ్డి, డీపీఎం భవానీ, తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీఓ కిషన్, సర్పంచ్, ఎంపీటీసీలు డైరెక్టర్లు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

భార్య ఆత్మహత్యాయత్నం

- మనస్తాపంతో భర్త బలవన్మరణం


నరేష్(ఫైల్)

కురవి : బావిలో దూకి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని గుండ్రాతిమడుగు(విలేజి)లో శుక్రవారం జరుగగా శనివారం గుర్తించినట్లు ఎస్సై బి.రాము తెలిపారు. ఆయన కథనం ప్రకారం ...గుండ్రాతిమడుగు(విలేజి) గ్రామానికి చెందిన కటికరెడ్డి నరేష్(27) నాలుగు నెలల క్రితం నేరడ శివారు భద్రుతండాకు చెందిన మౌనికను ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఇద్దరి మధ్య శుక్రవారం చిన్నపాటి గొడవ జరగగా మౌనిక చెట్ల పసరుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. నరేష్ తల్లి వెంటనే మహబూబాబాద్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ఆస్పత్రి నుంచి ఆమెను ఇంటికి తీసుకొచ్చారు. విషయం తెలుసుకున్న నరేష్ మనస్తాపంతో గ్రామశివారులోని బొల్లం అశోక్‌కు చెందిన వ్యవసాయబావి ఒడ్డుపై తన సెల్‌ఫోన్‌ను పెట్టి బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తల్లి సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. శవ పంచనామా చేసి పోస్టుమార్టం కోసం మహబూబాబాద్‌లోని జనరల్ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

భూ తగాదాల కారణంతో మహిళ ..

మహాముత్తారం : మండలంలోని మహబూబ్‌పల్లికి చెందిన గుంటి స్వప్న(40) భూతగాదాల కారణంతో బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం..అదే గ్రామానికి చెందిన గుంటి పోసక్క, చంద్రయ్యలు భూమి విషయంలో వేధింపులకు గురిచేయడంతో వేధింపులు తాళలేక ఇంటి సమీపంలోని బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. భర్త రాజయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు.

తప్పిపోయిన వ్యక్తి బావిలో పడి మృతి

ధర్మసాగర్: మండలంలోని క్యాతంపల్లికి చెందిన మోడెం రాజయ్య (65) 15 రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. అయితే బాధిత కుటుంబ సభ్యులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసి తెలిసిన వారి ఇళ్లలో వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. ఈ క్రమంలో క్యాతంపల్లి గ్రామ శివారులో ఓ వ్యక్తి శనివారం తన బావిచుట్టు ఉన్న చెట్లను శుభ్రం చేస్తుండగా బావిలో మృతదేహం కనిపించిది. దీంతో ఆయన స్థానికులకు సమాచారం ఇవ్వగా మృతదేహం మోడెం రాజయ్యగా గుర్తించారు.

ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య


రమేష్‌యాదవ్ (ఫైల్)

చిల్పూరు: మండలంలోని పల్లగుట్టకు చెందిన వేల్పుల కట్టమల్లయ్య పెద్ద కుమారుడు రమేష్ యాదవ్(42) శనివారం హైదరాబాద్‌లోని రహ్మత్‌నగర్‌లో తన ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామానికి చెందిన రమేష్ హైదరాబాద్‌లో ఉంటూ రియల్ ఎస్టేట్ చేసేవాడు. ఇటీవల అప్పులు కావడంతో, అప్పుల వారు ఎక్కడ నిలదీస్తారనే మనో వేదనతో క్షణికావేశంలో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్మకు పాల్పడ్డాడు. మృతునికి భార్య, కుమారుడు ఉన్నారు. రమేష్ మృతిపై చిల్పూరు ఆలయ చైర్మన్ శ్రీధర్‌రావు, వేల్పుల గట్టయ్య, చిర్ర నాగరాజు, శ్యాంసుందర్‌రెడ్డి, కుంచాల సంపత్‌రాజు, తదితరులు సంతాపం తెలిపారు.

'గురుకులం'లో విద్యార్థిని..


స్వాతి (ఫైల్)

వరంగల్ క్రైం: హంటర్‌రోడ్డులోని సోషల్ వెల్ఫేర్ గురుకుల డిగ్రీ కళాశాల విద్యార్థిని అనారోగ్య కారణాలతో శనివారం ఆత్మహత్యకు పాల్పడినట్లు సుబేదారి ఇన్‌స్పెక్టర్ షూకుర్ తెలిపారు. వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం దస్తగిరిపల్లికి చెందిన సంగి స్వాతి (20) కళాశాలలో తృతీయ సంవత్సరం చదువుతుందన్నారు. ఉదయం 6 గంటల సమయంలో తన దగ్గర ఉన్న సూపర్‌వాస్మల్‌ను (వెంట్రుకల కలర్)ను తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. తోటి విద్యార్థినిలు గమనించి ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు సీఐ తెలిపారు. మృతురాలు తండ్రి సంగి మొగిళి తన కూతురు అనారోగ్య కారణాలతో ఆత్మహత్యకు పాల్పడినట్లు ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

వందశాతం రెవెన్యూ వసూళ్లు సాధించాలి

- ఎన్పీడీసీఎల్ సీఎండీ ఎ.గోపాల్ రావు

హన్మకొండ: రెవెన్యూ వసూళ్లు వందశాతం సాధించాలని టీఎస్ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అన్నమనేని గోపాల్‌రావు అధికారులను ఆదేశించారు. శనివారం హనుమకొండ నక్కలగుట్టలోని టీఎస్ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో జనగామ, హనుమకొండ, భూపాలపల్లి జిల్లాల ఎస్ఈలు, డీఈలు, ఎస్ఏఓలతో సీఎండీ సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో సీఎండీ గోపాల్‌రావు మాట్లాడుతూ.. రాని బకాయిలు వసూలు చేయాలన్నారు. బ్రేక్‌డౌన్స్, ట్రిప్పింగ్స్ కాకుండా లైన్ పెట్రోలింగ్ చేయాలని, సబ్‌స్టేషన్స్ మెయింటెనెన్స్ చేయాలని సూచించారు. నూతన సర్వీసులను త్వరగా మంజూరు చేయాలన్నారు. సమావేశంలో డైరెక్టర్లు బి.వెంకటేశ్వర్‌రావు, గణపతి, పి.సంధ్యారాణి, వి.తిరుపతిరెడ్డి, సీజీఎంలు అశోక్ కుమార్, మోహన్‌రావు, కిషన్, బీకంసింగ్, జీఎం సత్యనారాయణ, ఎస్ఈలు వెంకటరమణ, వేణు మాధవ్, డీఈ ఐటీ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

పాన్‌షాపు డబ్బాను ఢీకొట్టిన కారు

- ఒకరికి తీవ్రగాయాలు


ధ్వంసమైన పాన్‌షాపు

ఖిలా వరంగల్: పాన్‌షాపు డబ్బు మీదకు కారు అతివేగంగా దూసుకొచ్చింది. మద్యం మత్తులో ఉన్న యువత అతివేగంగా డ్రైవ్‌చేయడంతో కారు అదుపు తప్పి పాన్‌షాపు డబ్బాను ఢీకొట్టడంతో షాపు నిర్వాహకుడికి తీవ్రగాయాలయ్యాయి. శనివారం మధ్యాహ్నం వరంగల్ చింతల్ ఫ్లైఓవర్ బ్రిడ్జి నుంచి ఖిలా వరంగల్ మధ్యకోటకు వెళ్లే రహదారిపై వాకింగ్ గ్రౌండ్ సమీపంలో ఏర్పాటు చేసిన ఓరుగల్లు ఫుడ్‌కోర్టు ప్రాంగణంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. వరంగల్ చింతల్‌కు చెందిన ఎండి నజీర్(33) ఖిలా వరంగల్‌లోని వాకింగ్ గ్రౌండ్ ఎదురుగా ఓరుగల్లు ఫుడ్‌కోర్టు ప్రాంగణంలో పాన్‌షాపును ఏర్పాటు చేసుకుని కుటుంబాన్ని పోషిస్తున్నాడు. శనివారం మధ్యాహ్నం శివనగర్‌కు చెందిన ఇద్దరు యువకులు మద్యం సేవించి అతివేగంగా కారు డ్రైవ్ చేస్తూ డబ్బాను ఢీకొట్టారు. దీంతో డబ్బాలో కూర్చున్న ఎండీ.నజీర్‌కు తీవ్రగాయాలయ్యాయి. కారులోని బెలూన్స్ ఓపెన్ కావడంతో ఇద్దరు యువకులు క్షేమంగా బయటపడ్డారు. క్షతగాత్రున్ని వెంటనే ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారుకులైన యువత కారును అక్కడే వదిలేసి పారిపోయారు. విషయం తెలిసిన వెంటనే మిల్స్‌కాలనీ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించినట్లు తెలిసింది.

గుండెపోటుతో ప్రైవేట్ అధ్యాపకుడి మృతి


జనార్దన్ (ఫైల్)

మహబూబాబాద్ రూరల్ : గుండెపోటుతో ప్రైవేట్ అధ్యాపకుడు మృతిచెందిన సంఘటన జిల్లా కేంద్రం లోని షికార్ ఖానగడ్డలో శనివారం చోటుచేసుకుంది. షికార్ ఖానగడ్డ ప్రాంతానికి చెందిన కడుదుల జనార్దన్ (48) జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు కళాశాలలో 25 ఏళ్ల నుంచి అధ్యాపకుడిగా పని చేస్తున్నాడు. శనివారం ఉదయం జనార్దన్ తన పనులు ముగించుకుని ఇంట్లోనే ఉన్న సమయంలో ఒక్కసారిగా గుండెనొప్పి వస్తుందని కుటుంబ సభ్యులకు చెప్పాడు. వారు వెంటనే ఆయనను చికిత్స నిమిత్తం అంబులెన్స్ లో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతిచెందారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆయన మృతిపై వార్డు కౌన్సిలర్ ఎడ్ల వేణు, మాజీ వార్డు సభ్యులు ఎడ్ల రమేష్ సంతాపం తెలిపారు.

ప్రభుత్వమే బాధ్యత వహించాలని రాస్తారోకో

టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ కారణంగా ఇక ఉద్యోగం రాదనే మనస్తాపంతో అధ్యాపకుడు కడుదుల జనార్దన్ గుండెపోటుతో మృతి చెందాడని, ప్రభుత్వమే ఇందుకు భాద్యత వహించాలని డిమాండ్ చేస్తూ తోటి అధ్యాపకులు ఇల్లందు రోడ్ ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా బుర్ర గోవర్ధన్, నీలం వెంకన్న మాట్లాడుతూ షికార్‌ఖానగడ్డకు చెందిన కడుదుల జనార్దన్ తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించారన్నారు. అతని మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని కోరారు. వారి కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రాస్తారోకోలో డాక్టర్ జోలి సత్యనారాయణ, బిక్కి వెంకటేశ్వర్లు, లకావత్ కిషన్, చాగంటి మీనయ్య, వీరయ్య, యాకన్న, రఘు, రవి, నదీం, వెంకటేష్, దయానంద్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో మహిళా రైతు..



జఫర్‌గడ్ : పనినిమిత్తం పంట పొలానికి వెళ్లిన మహిళా రైతు విద్యుదాఘతానికి గురై అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన మండలంలోని హిమ్మత్‌నగర్‌లో శనివారం సాయంత్రం జరిగింది. స్థానికులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన తాటికాయల లక్ష్మీనర్సమ్మ (60), భర్త పెద్ద సోమయ్య దంపతులు వ్యవసాయంపై ఆధారపడి వారి కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. వీరికి ముగ్గురు కుమార్తెలు ఒక కుమారుడు ఉన్నారు. గ్రామ శివారులో ఉన్న తమ వ్యవసాయ బావివద్ద వరి పొలాన్ని చూసేందుకు మధ్యాహ్నం లక్ష్మీనర్సమ్మ ఇంటి నుంచి వెళ్లింది. ఈదురు గాలులతో పాటు వర్షాలు కురవడంతో వ్యవసాయ బోరు బావికి సంబంధించిన ఎల్‌టీ విద్యుత్ వైర్ తెగి పొలంలో పడింది. ఇది గమనించని లక్ష్మినర్సమ్మ ఎల్‌టీ వైర్‌కు తాకడంతో విద్యుత్ షాక్ గురై అక్కడికక్కడే మృతి చెందింది. లక్ష్మి నర్సమ్మ సాయంత్రం అయినా ఇంటికి రాకపోవడంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు వ్యవసాయ బావివద్దకు వెళి చూడగా చనిపోయి ఉన్నట్లు తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

HOUSE FOR SALE

■ఉర్సుగుట్ట నుండి ఖాజీపేట్ వెళ్ళు 150 ఫీట్ల రోడ్డు ప్రక్కన, భట్టుపల్లి SR Prime School కు ఎదురుగా 2 & 3 BHK Independent Houses అమ్మకానికి కలవు. సెల్: 7660008666, 8309035091. [WA-26995]

■ములుగురోడ్డు కాకతీయ కెనాల్ కన్నెమూల గణపతి టెంపుల్‌కి దగ్గరలో G+1తో గల Independent Houses అమ్మకానికి కలవు. సెల్: 7660008666, 8309035091. [WA-26997]

■వరంగల్, రంగశాయిపేట, శేషాద్రిహిల్స్‌లో E/F తో గల డీలక్స్ Ready to Occupy 2 BHK House అమ్మకానికి కలదు. సెల్: 7660008666, 8309035091. [WA-26996]

FLAT FOR SALE

■ వరంగల్, హనుమకొండ, భీమారం సీతారామ ఆంజనేయ స్వామి గుడి దగ్గరలో నూతనంగా నిర్మించిన శ్రీలక్ష్మి నివాస్ నందు 2BHK FLATS అమ్మకానికి కలవు. Good Ventilation, Ready to Occupy సంప్ర॥ 9849101554. [WA-2951]

■KUDA కాలనీ, 100 ఫీట్ల రోడ్డుకి, SPR School కు దగ్గరలో Stilt Plus 5 ఫ్లోర్స్ అపార్ట్‌మెంటులో 2 & 3 BHK Luxury Flats అమ్మకానికి కలవు. సెల్: 7660008666, 8309035091. [WA-26994]

PLOT FOR SALE

■GWMC H.No. 28-5-474/A/1 హన్మకొండ చౌరస్తా నుండి 2KM లోపల తూర్పు ఫేసింగ్ 300 గజాలలో నూతనంగా నిర్మించిన ఒకరూం చుట్టూ కాంపౌండ్ వాల్ మరియు గేట్ నిర్మించి కరెంట్ కూడా వేసినది అమ్మబడును. సెల్: 9395561655. [W-785533]

■హన్మకొండ, గోపాల్‌పూర్ కల్లు మండువ దగ్గరలో విద్యాధరి స్కూల్ ప్రక్కన EAST ఫేసింగ్ 110 ఫీట్లు మెయిన్ రోడ్డుకు సెకండ్ బిట్ గల 1000 చ॥గ॥ల ప్లాట్ అమ్మబడును. సంప్ర॥ 9849101554. [WA-2953]

■దుర్గాదేవి కాలనీ రోడ్ నెంబర్. 3, హంటర్ రోడ్‌లో 271 చ॥గ॥ల నార్త్ ఫేసింగ్ 40x61 తో కూడిన ఫుల్ LRS గల ప్లాటు అమ్మకమునకు కలదు. సంప్ర॥ 8341368328, 9059973792. [WA-2952]

■ లోటస్ కాలనీ, కోమటిపల్లి, భీమారం నందు 400చ.గజాల, North Facing ప్లాటు క్లియర్ టైటిల్‌తో అమ్మకానికి కలదు. నోబ్రోకర్స్. ఫోన్ : 9490489083, 9704970783. [HA-10759]

SERVICES

■మా Bakery లో Fruit Juices Milk Shakes మరియు Ice Cream Scooping స్వంతముగా Sale చేయుటకు ఆసక్తి గలవారు సంప్రదించండి. 8897400681. [W-785532]

బ్యూటీపార్లర్

■మా శ్రీశైలి బ్యూటీ పార్లర్‌లో మెహెందీ కోర్సు Basic & Advanced 1 నెలలో నేర్పించబడును. మ్యారేజ్ మేకప్ చేయబడును. సెల్: 9989060668. [WA-2966]

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్

■మీ యొక్క సెప్టిక్ ట్యాంక్స్ నిండినవా? నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్పర్ మిషన్ ద్వారా మీ సెప్టిక్ ట్యాంక్స్ క్లీన్ చేయబడును. సంప్ర॥ డి.యస్. రావు, సెల్: 9849145043. [W-785498]

కరాటే శిక్షణ

■ Learn Kungfu/ Karate/ Kick Boxing / Sillambam Weight Loss classes No age Limit Home Tutions available. Cont: 9949382493, 8247898053. [W-785534]

OLD AGE HOME

■మీన్స్ వృద్ధుల సేవా సంస్థ నందు వృద్ధులకు, బెడ్ పేషెంట్స్‌కు, దీర్ఘవ్యాధులలో ఉన్నా వారికి, మానసిక, శారీరక వికలాంగులకు 24 గం॥ వైద్య, భోజనం, వసతి. ECIL, Hyd. సంప్ర: 9949520296/7981467036/6281127224. [H-781615]

ICE CREAMS

■Igloo Ice Cream Adalath HNK. వివాహ శుభ కార్యములకు ఐస్‌క్రీమ్ సప్లయి చేయబడును. సంప్ర॥ పొలం వేణుగోపాల్ రెడ్డి, 9849165892 PRR. 9849337526. [WA-6958]

BUSINESS OFFER

■ద్వారకా ఎంటర్‌ప్రైజెస్: పేపర్ ప్లేట్స్ & LED మెషిన్స్‌పై ప్రతినెల అధిక ఆదాయం, అద్భుత అవకాశం, ఉచిత ముడి పదార్థాలు 100% తిరిగి కొనుగోలు ఒప్పందం, ఫోన్: 9310515624, 8800496710 [DA-36266]

WANTED

■ శ్రీ గణేష్ ఆర్థోపెడిక్ హాస్పిటల్ నందు పనిచేయుటకు లేడి ఫార్మసిస్ట్ కావలెను. సంప్రదించవల్సిన సెల్ నెం: 9959303601, 9700295551. [WA-6964]

■ వరంగల్ చౌరస్తా LIC ఆఫీస్‌లో స్టాఫ్ M/F కావలెను. సంప్రదించవల్సిన సెల్: 9848073605 [WA-2964]

■ Govt. LIC of India లో అడ్వైజర్‌గా కమీషన్, సాలరీ పై పనిచేయుటకు Male/ Female పార్ట్‌టైం/ ఫుల్‌టైం పనిచేయుటకు సంప్రదించండి. సెల్: 9848073605 [WA-2965]

■ చికెన్ సెంటర్‌లో పనిచేయుటకు వర్కర్స్ & సూపర్‌వైజర్స్ కావలెను. రూమ్ మరియు భోజనం సౌకర్యం కలదు. వివరాలకు సంప్ర॥ 9849332336, 9492261559. [W-785531]

■ మా చికెన్ సెంటర్‌లో పనిచేయుటకు (2) ఇద్దరు వర్కర్స్ కావలెను. జీ॥ 15000/- + భోజనం + వసతి, ఖాజా & గౌస్ చికెన్ సెంటర్, మార్కెట్ ఏరియా, పర్కాల. సెల్: 9989460198 [W-1110368]

■ Urgently Required RMC Marketing Managers, Senior Accountants, Senior Civil Engineers, Site Supervisor HNK. Drop a Resume in Whatsapp. Cont: 7095778886, 8555890439, 9849277408, [WA-12869]

■ విజయవాడలో A/c & Coolers రెంటల్ (towerac.com) కంపెనీకి A/c టెక్నీషియన్స్-3, డోర్ డెలివరీ డ్రైవర్లు-3, హెల్పర్లు-5, 30సం.లోపు జీ: 18-25,000 ట్రైనింగ్/భోజనం/వసతి ఫ్రీ ✆ 90300 44646. [B-1165937]

■ అతి తక్కువ పెట్టుబడితో కంపెనీ నుండి పంపించే పాత రికార్డ్స్ చూసి కొత్తరికార్డ్స్ వ్రాసినందుకు వారంవారం అధిక ఆదాయం పొందండి. వివరాలకు ఫోన్ చేయండి. 77308 99503 [G-567]

■ ప్రముఖ కంపెనీ నందు మీ ఇంటి వద్దనే ఉండి పార్ట్ టైమ్/ఫుల్‌టైమ్ పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలయును. జీతం: 15000+ ఇన్సెంటివ్స్. ఫ్రీ బుకలెట్ కొరకు 8341371684 [G-786224]

■ సెక్యూరిటీ గార్డ్స్, సెక్యూరిటీ సూపర్‌వైజర్, కా॥ L.B. నగర్, ఘట్‌కేసర్, బాచుపల్లి, కొల్లూర్, జీడిమెట్ల, కాజగూడ & ఆఫీస్ బాయ్స్, హౌస్ కీపింగ్ కా॥ మంచి జీతం. మెట్రో మేనేజ్‌మెంట్. ఫోన్ : 9885657755, 9963077722. [H-781417]

■ Need MF Who Are Good At ENG Speaking, as PRI & HS Spoken ENG Trainers. Experience, not a must. Free Training by CFEL. Sal 20 - 30K. Ph : 8919641609 [H-781477]

■ పర్మినెంట్ జాబ్స్, ప్రముఖ సంస్థ నందు డేటా ఎంట్రీ ఆపరేటర్స్, సూపర్‌వైజర్స్, క్లర్క్స్, ఆఫీస్ బాయ్స్ కావలెను. Qul: 5 to డిగ్రీ, జీతం: 15000 to 35000 ఫోన్ : 9059630792 [HA-6163]

WANTED TEACHERS

■ To teach Nursery, LKG, UKG Pre Primary teachers E/M Background must pramotors also can apply # Vaagdevi Global Smart Public School, NGO's Colony, Main Road, Opp: Reliance Smart City Plaza, Hanamkonda, Cell: 9848612864, 8341570472. [W-785530]

మీ చిన్నారి పుట్టినరోజు శుభాకాంక్షలను ఇప్పుడు సాక్షి ద్వారా తెలియజేయండి కేవలం రూ.500/- మాత్రమే

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/-రూ॥ అదనపు లైను 60/- రూ॥లు మాత్రమే 5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
హన్మకొండ 9010144453
వరంగల్ 9705748198
నర్సంపేట 9010144453
జనగామ 9951602871
మహబూబాబాద్ 9010144453
జయశంకర్ భూపాలపల్లి 9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.